సాక్షి రంగారెడ్డి

మంగళవారం ၊ 20 ၊ జూన్ ၊ 2023



మొరాయిస్తున్న సర్వర్

జీసీ కుల వృత్తుల వారికి ప్రభుత్వం అందించే లక్ష రూపాయల సాయం దరఖాస్తులకు సర్వర్ సమస్యలు వెంటాడుతున్నాయి. 8లో▸



ఆపరేషన్ విజయవంతం

చేవెళ్లలోని పట్నం మహేందర్‌రెడ్డి జనరల్ ఆస్పత్రిలో మోకాలు మార్పిడి ఆపరేషన్ విజయవంతం అయింది. 8లో▸



వంతెన విస్తరణ షురూ..

ఆమనగల్లు నుంచి షాద్‌నగర్ వైపు వెళ్లే రోడ్డులో సురసముద్రం చెరువు అలుగు కాలువపై వంతెన విస్తరణ మొదలైంది. 8లో▸

న్యూస్‌రీల్

ఒకే విడతలో రుణమాఫీ చేయాలి



సమావేశంలో పాల్గొన్న తెలంగాణ ప్రజా చైతన్య సమితి నాయకులు

షాబాద్: రైతులకు ఒకే విడతలో రుణమాఫీ చేయాలని తెలంగాణ ప్రజా చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు నర్సింలు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడి ఐదేళ్లు గడుస్తున్నా రైతులకు రుణమాఫీపై స్పష్టత ఇవ్వకపోవడం దారుణమన్నారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రుణమాఫీ చేయ కుంటే రైతులు తగిన గుణపాఠం చెప్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, శంకర్, మోయిన్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి



ఎల్వర్తి గ్రామంలో మొక్కలు నాటుతున్న డీఆర్‌డీఏ పీడీ ప్రభాకర్ తదితరులు

శంకర్‌పల్లి: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని డీఆర్‌డీఏ పీడీ ప్రభాకర్ పేర్కొన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం హరితహారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్వర్తి గ్రామంలో మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ ఇంటి ఆవరణలో మొక్కలు నాటుకోవాలని సూచించారు. హరితహారంలో నాటిన మొక్కలు గ్రామాలకు పచ్చటి తోరణాలుగా మారాయని గుర్తు చేశారు. గ్రామాల్లో ఎక్కడ ఖాళీ స్థలం ఉన్న మొక్కలు నాటాలన్నారు. నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ధర్మన్నగారి గోవర్ధన్ రెడ్డి, ఎంపీడీవో వెంకయ్యగౌడ్, ఏపీవో నాగభూషణ్, ఎల్వర్తి సర్పంచ్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న ఏసీపీ కుశాల్కర్ తదితరులు

షాద్‌నగర్: పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఏసీపీ కుశాల్కర్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం హరితోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణ సీఐ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు.కార్యక్రమానికి ఏసీపీ కుశాల్కర్ హాజరై మొక్కలు నాటి నీళ్లు పోశారు.ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటిని పెంచే బాధ్యతను తీసుకోవాలని అన్నారు. హరితహారంలో భాగంగా నాటిన మొక్కలను కాపాడాలని సూచించారు. మనం నాటిన మొక్క భావి తరాలకు ఫలాలను అందిస్తుందన్నారు. చెట్లు లేకపోతే వాయు కాలుష్యం ఏర్పడి వాతావరణం పూర్తిగా కలుషితమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ శ్రీశైలం, ఎస్ఐలు విజయ్, దేవకి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పీజీ కాలేజీల డైరెక్టర్ నియామకం



ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో అయిదు జిల్లాల కేంద్రాలలో ఓయూ అనుబంధంగా కొనసాగుతున్న పీజీ కాలేజీల డైరెక్టర్‌గా ప్రొ.రవికుమార్ నియమితులయ్యారు. ఓయూ పరిధిలోని సిద్దిపేట, వికారాబాద్, నర్సాపూర్, జోగిపేట, మిర్జాపూర్ పీజీ కాలేజీల నిర్వహణకు ప్రొ.రవికుమార్ డైరెక్టర్‌గా సోమ వా రం పదవీ బాధ్యతలు స్వీకరించారు.



సీఎం కేసీఆర్‌కు మొక్కను బహూకరిస్తున్న మంత్రి సబితారెడ్డి



సభకు హాజరైన కార్యకర్తలు, జనం

కందుకూరు వరకు మెట్రో

మహేశ్వరంలో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తాం

- ముఖ్యమంత్రి కేసీఆర్ వరాల జల్లు
- తుమ్మలూరు ఫారెస్ట్‌లో హరితహారం ప్రారంభం

సాక్షి, రంగారెడ్డి జిల్లా: శంషాబాద్ నుంచి తుక్కుగూడ మీదుగా కందుకూరు వరకు మెట్రో రైలును విస్తరించనున్నట్లు ముఖ్యమంత్రి కేసీఆర్ తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గంలో కొత్తగా వైద్య కళాశాలను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. సోమవారం తుమ్మలూరులో జరిగిన హరితహారం కార్యక్రమంలో మొక్కలు నాటిన అనంతరం జరిగిన సభలో సీఎం మాట్లాడారు. మహేశ్వరం నియోజకవర్గంలోని రెండు పురపాలికలు, రెండు నగర పాలికలకు రూ.150 కోట్లు, 66 గ్రామ పంచాయతీలకు రూ.9.90 కోట్లు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. తుమ్మలూరులో సబ్‌స్టేషన్ సహా దశాబ్ది కమ్యూనిటీ హాల్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. తుక్కుగూడ, జల్‌పల్లి మున్సిపాలిటీలకు రూ.25 కోట్ల చొప్పున.. బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్లకు రూ.50 కోట్ల చొప్పున మంజూరు చేస్తున్నట్లు సీఎం వెల్లడించారు.

దేశానికే ఆదర్శం: ఇంద్రకరణ్‌రెడ్డి, అటవీశాఖ మంత్రి

హరితహారం కార్యక్రమం ముఖ్యమంత్రి కేసీఆర్ మానస పుత్రిక. తెలంగాణ పచ్చదనంతో విరాజిల్లుతోంది. ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోంది. ఐఎఫ్ఎస్ ఆఫీసర్లు ఫీల్డ్ విజిట్‌కు వచ్చిపోతున్నారు. పదేళ్లలో 33 శాతం గ్రీనరీ వస్తుంది. హెచ్ఎండీ, జీహెచ్ఎంసీ, అటవీ శాఖల ద్వారా ఇప్పటికే పెద్ద సంఖ్యలో మొక్కలు నాటాం. ఈ ఏడాది కూడా భారీగా మొక్కలు నాటాలని నిర్ణయించాం.

కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యం: సబితారెడ్డి, విద్యాశాఖ మంత్రి

సమైక్య రాష్ట్రంలో అనేక విధాలుగా నష్టపోయాం. ఉద్యమనేత, సీఎం కేసీఆర్ హయాంలో రంగారెడ్డి జిల్లా రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. ఇప్పటికే జిల్లాకు అనేక పరిశ్రమలను తీసుకొచ్చారు. ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లతో జిల్లా రూపు రేఖలే మార్చేశారు. అభివృద్ధిలోనే కాదు ఆదాయ, వ్యయాల్లోనూ జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. సీఎం కేసీఆర్ విజన్, మంత్రి కేటీఆర్ పర్యవేక్షణతోనే ఇదంతా సాధ్యమైంది.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత: శాంతికుమారి, సీఎస్

అడవుల పునరుద్ధరణ కోసం ప్రభుత్వం కంకణం కట్టుకుంది. హరితహారం కార్యక్రమాన్ని గత తొమ్మిదేళ్లుగా ఓ యజ్ఞంలా చేస్తోంది. అడవుల శాతాన్ని 22 నుంచి 33 శాతానికి పెంచాలని కంకణం కట్టుకుంది. ఆ మేరకు ప్రభుత్వ ఖాళీ ప్రదేశాలు, రహదారుల వెంట భారీగా మొక్కలు నాటింది. ఈ తొమ్మిదేళ్లలో పచ్చదనాన్ని భారీగా పెంచింది. మొక్కలు నాటి వాటిని సంరక్షించడంలో దేశానికే ఆదర్శంగా నిలిచింది. నాటిన మొక్కను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది.



కేసీఆర్ ప్రసంగానికి ఉత్సాహం

భారీగా ట్రాఫిక్ జాం..ప్రయాణికులకు ఇక్కట్లు

సీఎం పర్యటన ప్రశాంతంగా ముగియడంతో పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు. పార్టీ అభిమానులు, ఉద్యోగులు, అధికారులు, ప్రజా ప్రతినిధుల రాకతో ఇటు తుక్కుగూడ నుంచి అటు కడ్తాల్ వరకు శ్రీశైలం జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జాం ఏర్పడింది. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు యెగ్గె మల్లేశం, బి.దయానంద్, ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, జైపాల్‌యాదవ్, కాలె యాదయ్య, అంజయ్య యాదవ్, ప్రకాష్ గౌడ్, సుధీర్‌రెడ్డి, సీఎం కార్యదర్శి భూపాల్‌రెడ్డి, సీఎం ఓఎస్‌డీ ప్రియాంక వర్గీస్, పీసీసీఎఫ్ రాకేష్ మోహన్ డోబ్రియాల్, కలెక్టర్ హరీష్, అదనపు కలెక్టర్లు ప్రతీక్‌జైన్, తిరుపతిరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

'పట్నం' దూరం!

మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి సీఎం టూర్‌కు దూరంగా ఉన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా తుమ్మలూరు అర్బన్ ఫారెస్ట్‌లో నిర్వహించిన హరితహారం ప్రారంభోత్సవ కార్యక్రమానికి సీఎం కేసీఆర్ హాజరయ్యారు. సాధారణంగా సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ పాల్గొనే సభల్లో ఆయన అందరికన్నా ముందుంటారు. ఎంతటి బిజీ షెడ్యూల్ ఉన్నా.. పనులన్నీ వాయిదా వేసుకుని వస్తారు. కానీ కొంతకాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఆయన కాంగ్రెస్‌లో చేరతారనే ప్రచారం కూడా ఉంది. వికారాబాద్ జిల్లాతో పాటు చేవెళ్ల నియోజకవర్గంపై మహేందర్‌రెడ్డికి మంచి పట్టుంది. గత శాసన మండలి ఎన్నికల్లో స్థానిక సంస్థల కోటాలో జిల్లా నుంచి పోటీ చేసి గెలుపొందారు. మొదట్లో పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్న ఆయన ఇటీవల కొంత దూరంగా ఉంటున్నారు. తాజాగా సీఎం పర్యటన నేపథ్యంలో గైర్హాజరవడం చర్చనీయాంశమైంది.

కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం ఖాయం

- మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్

మొయినాబాద్: కాంగ్రెస్ పార్టీకి త్వరలోనే పూర్వవైభవం రాబోతోందని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్ అన్నారు. రాహుల్‌గాంధీ పుట్టిన రోజు సందర్భంగా సోమవారం ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షాబాద్ దర్శన్, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డితో కలిసి కేక్ కట్ చేసి, రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రతో దేశ ప్రజల సమస్యలు తెలుసుకున్నారని అన్నారు. ఆ సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావిస్తే పరువుపోతుందని ప్రధాని నరేంద్ర మోదీ, రాహుల్‌గాంధీ సభ్యత్వాన్ని రద్దు చేశారని విమర్శించారు. కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికలకు కార్యకర్తలంతా సిద్ధంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా తలసేమియా అండ్ సికిల్ సెల్ సొసైటీ ఉప్పల వెంకటయ్య మెమోరియల్ బ్లడ్ సెంటర్‌కు 50 యూనిట్లు రక్త దానం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సోహెల్ ఖాన్, పీసీసీ కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, సమన్వయ కమిటీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మాణయ్య, మైనార్టీ సెల్ అధ్యక్షుడు రియాజ్ పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న అంజన్‌కుమార్ యాదవ్

మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి

షాద్‌నగర్‌రూరల్: నేటి యువత మహనీయుల జీవిత చరిత్రను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని విశ్వహిందూ పరిషత్ క్షేత్రప్రముఖ్ బండారి రమేష్ అన్నారు. ప్రముఖ ఆధ్యాత్మిక ప్రబోధకులైన శ్రీ రామానుజాచార్యుల జీవిత చరిత్రను సినిమా రూపంలో తీస్తున్న జయహో రామానుజ చిత్రం మొదటి భాగం పూర్తయిన సందర్భంగా చిత్రంలోని నటీనటులు ప్రమోషన్‌కోసం హైదరాబాద్ నుంచి తమిళనాడులోని శ్రీరంగంకు బయలుదేరారు. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ సభ్యులకు సోమవారం పట్టణంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంవద్ద సంస్కారభారతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు టీవీ రంగయ్య ఆధ్వర్యంలో విశ్వహిందూ పరిషత్ క్షేత్రప్రముఖ్ బండారి రమేష్ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహనీయుల జీవితాలను తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ప్రస్తుతం అలాంటి వారి జీవిత చరిత్ర ఆధారంగా సినిమాలను రూపొందించి సమాజానికి అందించాలన్నారు. రామానుజాచార్యుల జీవిత చరిత్ర ఆధారంగా తీసిన జయహో రామానుజ చిత్రాన్ని ఆదరించి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మఠం రాచయ్య, రంగయ్య, బాలబ్రహ్మచారి, సింగారం శ్రీనివాస్, శివ, శ్యామలప్ప, మురళి, హన్మంత్‌రెడ్డి, ఆదినారాయణ పాల్గొన్నారు.



చిత్రంలో నటించిన నటీనటులను సన్మానిస్తున్న బండారి రమేష్ తదితరులు

పత్రాలకోసం పడిగాపులు



రోడ్డుపై రాస్తారోకోకు దిగిన ప్రజలు

- పది రోజులవుతున్నా కుల, ఆదాయ పత్రాలు రాలేదని ఆందోళన
- రహదారిపై రాస్తారోకో.. చెదరగొట్టిన పోలీసులు

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వం అందించే రూ.లక్ష సాయంకోసం దరఖాస్తు చేసుకునేందుకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలకోసం తహసీల్దారు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. దరఖాస్తు పెట్టి పది రోజులు గడుస్తున్నా పత్రాలు రాలేదు. దరఖాస్తు గడువు ఒక్కరోజే ఉండటం, పత్రాలు రాకపోవడంతో ఆందోళన చెందిన ప్రజలు గంట పాటు రాస్తారోకో చేపట్టి రోడ్డుపై బైఠాయించారు. ఈ ఘటన సోమవారం రాత్రి షాద్‌నగర్ పట్టణంలోని పాతజాతీయ రహదారిపై చోటు చేసుకుంది.

పది రోజులైనా పత్రాలు రాలేదు

రూ.లక్ష సాయంకోసం దరఖాస్తు చేసుకునేందుకు కావాల్సిన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలకోసం మీ సేవలో దరఖాస్తు పెట్టుకున్నారు. తహసీల్దారు కార్యాలయంలో నెట్ వేగవంతం లేకపోవడంతో ఆలస్యం అవుతున్నాయి. దీంతో కార్యాలయ సిబ్బంది రాత్రి వేళల్లోనూ కుల, ఆదాయ పత్రాల ప్రక్రియను కొనసాగిస్తున్నారు. దరఖాస్తుదారులు కుల, ఆదాయం పత్రాలకోసం తహసీల్దారు కార్యాలయం వద్ద రాత్రి, పగలు తేడా లేకుండా పడిగాపులు కాస్తున్నారు. దరఖాస్తు చేసి పది రోజులువుతున్నా పత్రాలు రాలేదని.. రోజుల తరబడి కార్యాలయం చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొందని వాపోయారు.

గంట పాటు రాస్తారోకో

కుల వృత్తులు, చేతి వృత్తుల వారికి ప్రభుత్వం ఇస్తామన్న లక్షసాయం గడువు నేటితో ముగియనుంది. కుల, ఆదాయ పత్రాలకోసం దరఖాస్తు చేసి రోజులు గడుస్తున్నా రాకపోవడం, లక్ష సాయం దరఖాస్తుకు గడువు ముగియనుండటంతో ఆందోళనకు గురయ్యారు. దరఖాస్తు చేసేందుకు పత్రాలు రాకపోవడం, గడువు ముగిస్తే సాయం అందదనే ఆలోచనతో ప్రజలందరు మూకుమ్మడిగా నిరసనకు దిగారు. ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పాత జాతీయ రహదారిపై రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. గంటపాటు రాస్తారోకో చేపట్టడంతో వాహనాలు బారులు తీరాయి. ఆందోళనకారులకు మద్దతు తెలిపిన కాంగ్రెస్ నాయకులు రోడ్డుపై బైఠాయించారు.

పోలీసుల హామీతో ..

విషయం తెలుసుకున్న పట్టణ సీఐ నవీన్‌కుమార్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. రోడ్డుపై వాహనాలను ఆపితే సమస్య తీరదని, అక్కడి నుంచి వెళ్లిపోవాలని చెప్పినా వినిపించుకోలేదు. దీంతో పోలీసులు ఆందోళనకారులను చెదరగొట్టారు. కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తహసీల్దారుతో మాట్లాడి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానని సీఐ నవీన్‌కుమార్ హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు శాంతించారు. అనంతరం పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

జాడ లేని వాన

- ఈఏడాది ఇంకా పలకరించని తొలకరి
- ఖరీఫ్ సాగుకు సిద్ధమైన రైతులు
- వరుణుడికోసం ఎదురుచూపులు

చేవెళ్ల/షాబాద్: మండు వేసవిలో వర్షాలు జోరుగా కురిశాయి. వానాకాలంలో ఎండలు మండుతున్నాయి. వరుణుడి కరుణ కోసం అన్నదాతలు ఆకాశంకేసి చూస్తున్నారు. ఖరీఫ్ సాగుకోసం దుక్కులు దున్ని ఎప్పుడు వర్షం పడితే అప్పుడు పొలాల్లో విత్తనాలు విత్తుకునేందుకు సిద్ధమయ్యారు. మే 26 నుంచి రోహిణి కార్తె ప్రారంభం కాగానే వర్షాల కోసం ఎదురుచూసిన రైతులకు జూన్ సగం గడిచిపోయినా జాడ లేకపోవడంతో తొలకరి కోసం నిరీక్షిస్తున్నారు. గతేడాది ముందుగానే పలుకరించటంతోపాటు జూన్‌లో సాధారణ కంటే అధిక వర్షపాతం నమోదైంది. ఏటా జూన్‌లో సాధారణ వర్షపాతం 94.0మి. మీటర్లు ఉండగా గతేడాది 126 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. నైరుతి రుతుపవనాలు త్వరలో వస్తాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నప్పటికీ జిల్లాలో ఇంకా 39 నుంచి 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

4,39,631 ఎకరాల సాగు అంచనా

జిల్లాలో ఈఏడాది సాగు విస్తీర్ణంపై వ్యవసాయాధికారులు ముందుగానే అంచనాలు వేశారు. వాతావరణం అనుకూలిస్తే గతేడాది సాగు లెక్కల ప్రకారం ఈఏడాది 4,39,631 ఎకరాల్లో పంటల సాగు, 20,661 క్వింటాళ్ల విత్తనాలు అవసరం ఉంటాయని అంచనా వేశారు. ఈఏడాది పత్తి సాగు ఎక్కువగా ఉంటుందని, దీనికి తగిన విధంగా 3,98,000 విత్తనాల ప్యాకెట్లు, ఎరువులు అందుబాటులో ఉంచాలని నిర్ణయించారు. ఈ ఏడాది 64 శాతం జీలుగ విత్తనాలను సబ్సిడీపై అందజేశారు. గతేడాది కంటే ఈఏడాది సాగు విస్తీర్ణం 90వేల ఎకరాలు ఎక్కువగా ఉంటుందని అంచనా వేశారు. వర్షాల జాడ కనిపించకపోవటంతో అధికారుల అంచనాలు తలకిందులయ్యేలా ఉన్నాయి.

మొక్కజొన్న సాగు తగ్గే అవకాశం..

సాధారణంగా జూన్‌లో వర్షాలు కురిస్తే రైతులు మొక్కజొన్న అధికంగా సాగు చేస్తారు. ఈ ఏడాది ఇంతవరకు కురవకపోవడంతో సాగు విస్తీర్ణం తగ్గిపోయే అవకాశం ఉంది.

ఆరేళ్లుగా జూన్‌లో నమోదైన వర్షపాతం వివరాలు

సంవత్సరం	సాధారణ వర్షపాతం	కురిసిన వర్షపాతం (మి.మీ)
2017-18	94	195.6
2018-19	94	86.4
2019-20	94	91.3
2020-21	94	155.0
2021-22	94	90.3
2022-23	94	126.0
2023-24	94	15.3 ఇప్పటివరకు



చేవెళ్ల: పొలంలో విత్తనాలు వేసేందుకు సిద్ధం చేసుకుంటున్న రైతు

ఎదురుచూస్తున్నాం



ఇప్పటికే వర్షాలుపడి ఉంటే విత్తనాలు వేసుకునే వాళ్లం. గతేడాది పత్తి సాగు చేశాను. ఈఏడాది వర్షాలు అనుకూలిస్తే మొక్కజొన్న సాగు చేస్తాను. నెలరోజుల కాలం పోయింది. వర్షాల కోసం ఎదురుచూస్తున్నాం. ఆలస్యమైతే కంది వేస్తాను.

-పి.నర్సింలు, రైతు, ఆలూరు

ఇంకా సమయం ఉంది



తొలకరి వర్షాలు ఇప్పటికే కురవాల్సి ఉంది. రుతుపవనాలు ఈ ఏడాది ఆలస్యమవుతాయని వాతావర ణ శాఖ ముందుగానే తెలిపింది.విత్తనాలు వేసుకు నేందుకు ఇంకా సమయం ఉంది. వర్షాలు పడి భూ మి చల్లబడిన తరువాతే విత్తనాలు విత్తుకోవాలి.

– రమాదేవి, ఏడీఏ, చేవెళ్ల

శభాష్.. లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్: తెలంగాణ హరితోత్సవంలో భాగంగా సోమవారం జిల్లాలోని మహేశ్వరం మండలం తుమ్మలూర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కడ్తాల్ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డిని సీఎం కేసీఆర్ అభినందించారు. కడ్తాల్ గ్రామ పంచాయతీలో జరిగిన వివాహాలకు సంబంధించి ధృవీకరణ పత్రం పొందాలంటే నవదంపతులు మొక్కలు నాటాలని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు (కడ్తాల్ సర్పంచ్) లక్ష్మీనర్సింహారెడ్డి, పంచాయతీ పాలకమండలి తీర్మానం చేసిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని గ్రీన్ ఇండియా చాలెంజ్ రూపకర్త, ఎంపీ సంతోష్ కుమార్‌కు సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి ట్విట్టర్ వేదికగా తెలియజేశారు. ఈ విషయం తెలుసుకున్న సీఎం కేసీఆర్ తుమ్ములూరులో జరిగిన సమావేశంలో సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డిని, పాలకమండలిని ప్రత్యేకంగా అభినందించారు.


సీఎం కేసీఆర్‌ను సన్మానిస్తున్న లక్ష్మీనర్సింహారెడ్డి

మోకాలి మార్పిడి ఆపరేషన్ విజయవంతం

చేవెళ్ల: మండల కేంద్రంలోని పట్నం మహేందర్ రెడ్డి జనరల్ ఆస్పత్రిలో మోకాలు మార్పిడి ఆపరేషన్ విజయవంతం అయిందని ఆస్పత్రి ఇన్‌చార్జి వినోద్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఇటీవల మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్న బుచ్చిరెడ్డి (67) తమ ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యారు. పరీక్షించిన వైద్యులు.. అతని మోకాళ్లలో అరుగుదలను గుర్తించారు. నడవలేని స్థితిలో ఉన్న అతనికి వైద్యులు డాక్టర్ వంశీ, డాక్టర్ సాయి, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ షబ్బీర్, డాక్టర్ రాజేశ్ ఆపరేషన్ చేశారు. ఆస్పత్రిలో కొత్తగా ఎంఆర్ఐ స్కానింగ్ యంత్రం కూడా అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు.


మోకాలి మార్పిడి ఆపరేషన్ విజయవంతం చేసిన వైద్యులు

బావిలో పడి వ్యక్తి మృతి

చేవెళ్ల: మతిస్థిమితం లేని ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందాడు. ఈ సంఘటన చేవెళ్లలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. చేవెళ్లలోని దుర్గమ్మ గుడి సమీపంలో ఉన్న బావిలో గుర్తు తెలియని వ్యక్తి పడిపోయి మృతి చెందాడు. అటుగా వెళ్తున్న స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని వెలికితీశారు. మతిస్థిమితం లేని గుర్తు తెలియని వ్యక్తిగా గుర్తించారు. అతని వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

కాళీమాత ఆలయంలో చోరీ

శంకర్‌పల్లి: కాళికామాత ఆలయంలో చోరీ జరిగింది. ఈ సంఘటన శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మున్సిపల్ పరిధిలోని బుల్కాపురం కాళికమాత ఆలయ పూజారి రామచంద్రయ్య రోజు మాదిరిగానే సోమవారం ఉదయం ఆలయానికి వచ్చారు. గుడి తలుపులు తెరిచి ఉండటంతో కంగారు పడి హుండీని పరిశీలించాడు. అందులో డబ్బులు లేకపోవడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. రూ.30వేలు చోరీకి గురైనట్లు పూజారి రామచంద్రయ్య తెలిపారు. గతంలో రెండు సార్లు కూడా హుండీలో డబ్బులను ఎత్తుకెళ్లడం జరిగిందన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రసన్నకుమార్ పేర్కొన్నారు.

కూతురి పట్ల అసభ్యకరంగా..

ప్రవర్తించిన తండ్రి అరెస్ట్

మంచాల: కన్న కూతురిపై అసభ్యకరంగా ప్రవర్తించిన తండ్రిని మంచాల పోలీసులు అరెస్టు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు. ఎస్సై రవినాయక్ తెలిపిన వివరాలు.. మండలంలోని తాళ్లపల్లి గూడ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కన్న కూతురిపై కొన్ని రోజులుగా అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. తండ్రి వేధింపులు తట్టుకోలేక యువతి స్థానికుల సహకారంతో పోలీసులను ఆశ్రయించింది. వారునిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఐఐటీ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో అనూష ప్రతిభ

చేవెళ్ల: ఐఐటీ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో చేవెళ్ల ఆదర్శ కళాశాల విద్యార్థిని సార్ల అనూష ప్రతిభ కనబరిచారు. సోమవారం ఆ పాఠశాల ప్రిన్సిపాల్ టీనావతి, ఉపాధ్యాయ బృందం విద్యార్థిని అనూషను అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. చేవెళ్ల నుంచి మొదటి సారిగా ఐఐటీ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో తమ పాఠశాల విద్యార్థిని క్వాలిఫై కావడం సంతోషంగా ఉందన్నారు. త్వరలో అనూషకు ఐఐటీలో సీటు వస్తుందని తెలిపారు.


అనూష

మొరాయిస్తున్న సర్వర్

- రూ. లక్ష సాయం దరఖాస్తులకు తప్పని పాట్లు
- నేటితో ముగియనున్న గడువు
- మీ-సేవ, తహసీల్దార్ కార్యాలయం వద్ద సర్టిఫికెట్ల కోసం పడిగాపులు
- దరఖాస్తు గడువు పెంచాలని పలువురి వినతి


చేవెళ్ల మీ-సేవ కేంద్రం వద్ద కుల, ఆదాయ సర్టిఫికెట్ల దరఖాస్తుల కోసం తరలివచ్చిన జనం

చేవెళ్ల: బీసీ కుల వృత్తుల వారికి ప్రభుత్వం అందించే లక్ష రూపాయల సాయం దరఖాస్తులకు ఆన్‌లైన్(సర్వర్) సమస్యలు వెంటాడుతున్నాయి. దీంతో దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు ఇబ్బందులు పడుతున్నారు. రూ. లక్ష సాయం కోసం దరఖాస్తు చేసుకోవడానికి మంగళవారం చివరి తేదీ కావడంతో అర్హుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. కుల, ఆదాయ సర్టిఫికెట్లు తప్పని సరి కావడంతో వీటి కోసం మీ-సేవ, తహసీల్దార్ కార్యాలయాలకు పరుగులు తీస్తున్నారు. మూడు రోజులుగా సర్వర్ డౌన్ సమస్యలు వెంటాడుతుండడంతో సర్టిఫికెట్లు పొందలేక కార్యాలయాల్లో పడిగాపులు కాస్తున్నారు.

దరఖాస్తు గడువు పెంచాలి

రూ. లక్ష సాయం కోసం దరఖాస్తు గడువును పెంచాలని బీసీ కుల వృత్తుల వారు కోరుతున్నారు. కుల, ఆదాయ సర్టిఫికెట్లు లేకపోతే దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం లేదని, సర్టిఫికెట్లు సకాలంలో అందడం లేదని వారు వాపోయారు. ప్రభుత్వం స్పందించి గడువు పెంచాలని కోరారు. అలాగే సర్వర్ సమస్యలు లేకుండా చూడాలని విన్నవించారు. ఒక్క రోజు మాత్రమే గడువు ఉండడం, వందల సంఖ్యలో దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటన్నింటిని అప్‌లోడ్ చేయడం సాధ్యం కాదని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇదే సమస్య ఉందని తెలిపారు

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయొచ్చు



కుల, ఆదాయ సర్టిఫికెట్ల కోసం మీ-సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకుంటే సీరియల్ నంబర్ వస్తుంది. అది తహసీల్దార్ కార్యాలయంలో అప్రూవల్ కావాలి. ఆ తర్వాత రూ. లక్ష సాయం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. మూడు రోజులుగా సర్వర్ స్లోగా ఉండడం వల్ల తహసీల్దార్ కార్యాలయం నుంచి అప్రూవల్ రావడం లేదు.

– ధనుంజయ్, మీ-సేవ కేంద్రం యాజమాని, చేవెళ్ల

సర్వర్ డౌన్ కావడంతో సమస్య



కుల, ఆదాయ పత్రాల కోసం పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నాయి. సర్వర్ నెమ్మదించడంతో సర్టిఫికెట్లు సకాలంలో జారీ చేయలేకపోతున్నాం. సిబ్బంది పగలు, రాత్రి కూడా పని చేస్తున్నారు. సాధ్యమైనంత వరకు దరఖాస్తు చేసుకున్న అందరికీ సర్టిఫికెట్లు అందించే ప్రయత్నం చేస్తున్నాం.

– శ్రీనివాస్‌రావు, తహసీల్దార్, చేవెళ్ల

ఏబీవీపీ నిరసనలో విద్యార్థులకు గాయాలు

ఫీజుల పెంపుపై పాఠశాల ఎదుట ఆందోళన

కడ్తాల్: అధిక ఫీజులు వసూలుపై ఏబీవీపీ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళనకు దిగారు. ఈ సంఘటన కడ్తాల్‌లోని పార్చున్ బటర్‌ఫ్లై సిటీ పాఠశాల ఆవరణలో చోటుచేసుకుంది. విద్యార్థులు పాఠశాల ఎదుట బైఠాయించి.. యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ నేపథ్యంలో ఏమైన సమస్య ఉంటే ప్రిన్సిపాల్‌తో మాట్లాడాలని, ఆందోళన చేపట్టడం ఎందుకని ఏబీవీపీ నాయకులతో పాఠశాల సిబ్బంది వాగ్వాదానికి దిగారు. దీంతో ఇరువురి మధ్య తోపులాట జరిగింది. కోపోద్రిక్తుడైన ఏబీవీపీ నాయకులు పాఠశాల ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. దీంతో ఇద్దరు విద్యార్థులకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు.. ఏబీవీపీ నాయకులను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ప్రిన్సిపాల్ సంజీవ్ ఫిర్యాదు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరిశంకర్‌గౌడ్ తెలిపారు.


గాయపడిన విద్యార్థిని రోజ

వంతెన విస్తరణ షురూ..

- శిథిలావస్థలో సురసముద్రం అలుగుపై బ్రిడ్జి
- రూ.3 కోట్లతో మరమ్మతు, విస్తరణ పనులు
- నాలుగు నెలల్లో పూర్తిచేస్తామంటున్న అధికారులు


కొనసాగుతున్న వంతెన విస్తరణ పనులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణం నుంచి షాద్‌నగర్ వైపు వెళ్లే రోడ్డులో సురసముద్రం చెరువు అలుగు కాలువపై దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరుకుంది. దీంతో వంతెన గుండా వెళ్లే వాహనదారులు భయాందోళనకు గురయ్యేవారు. అయితే త్వరలో ఆ ఇబ్బందులు తీరనున్నాయి. ఇరుకుగా ఉన్న వంతెనను వెడల్పు చేయడంతో పాటు దాని మరమ్మతులు చేపట్టనున్నారు. రూ.3కోట్లతో చేపట్టనున్న ఆయా పనులను మూడు-నాలుగు నెలల్లో పూర్తిచేస్తామని అధికార వర్గాలు తెలిపాయి.

శిథిలావస్థలో వంతెన..

షాద్‌నగర్ రోడ్డులో సురసముద్రం చెరువు అలుగుపై వాహనాల రాకపోకలు దాదాపు మూడు దశాబ్దాల క్రితం వంతెన నిర్మించారు. అప్పట్లో వాహనాల రాకపోకలకు ఈ వంతెన సరిపోయింది. అయితే కాలానుగుణంగా వాహనాల సంఖ్య పెరగడం, రాకపోకలు ఎక్కువవడంతో వంతెన ఇరుకుగా మారింది. దీనికితోడు వంతెనకు మరమ్మతులు చేయకపోవడంతో పలుచోట్ల ఇనుపచువ్వలు తేలి ప్రమాదకరంగా మారింది.

రోడ్డు విస్తరణ పనుల నేపథ్యంలో..

తలకొండపల్లి నుంచి ఆమనగల్లు వరకు రోడ్డు ఆధునీకరణతో పాటు విస్తరణ కోసం ప్రభుత్వం గతుడాది రూ.37 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో ఆమనగల్లు, తలకొండపల్లి మండల కేంద్రాల్లో రోడ్డు వెడల్పు పనులతో పాటు 18 కిలోమీటర్ల రోడ్డును ఆధునీకరిస్తున్నారు. బీటీ రోడ్డు ఆధునీకరణ పనులు పూర్తికాగా తలకొండపల్లిలో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆమనగల్లు పట్టణంలోని సురసముద్రం అలుగుపై ఉన్న వంతెన విస్తరణ పనులు కూడా చేపట్టారు.

18 మీటర్ల వెడల్పు ..

ఆమనగల్లు పట్టణంలోని సురసముద్రం చెరువు అలుగుపై ప్రస్తుతం 8.5 మీటర్ల వెడల్పు, 65 మీటర్ల పొడవు వంతెన ఉంది. వంతెనకు ఇరువైపులా మరో 9 మీటర్ల చొప్పున విస్తరణ పనులు చేపట్టనున్నారు. ఇటీవల వంతెన విస్తరణ పనులను ఆర్అండ్‌బీ అధికారులు ప్రారంభించారు. జిల్లా ఆర్అండ్‌బీ ఈఈ శ్రవణ్‌ప్రకాశ్, డిప్యూటీ ఈఈ రవీంద్రకుమార్, ఏఈ రవితేజ పనులను పర్యవేక్షిస్తున్నారు. వీలైనంత త్వరగా వంతెన విస్తరణ పనులు పూర్తిచేస్తామని తెలిపారు.

కేఎఫ్‌సీలో ఆల్ న్యూ స్నాకర్స్ శ్రేణి

సాక్షి, సిటీబ్యూరో: ఆహార ప్రియులను సంతృప్తి పరచడానికి ఇకపై కేవలం 99 రూపాయలకే తమ ఉత్పత్తులను అందించే ఆల్ న్యూ స్నాకర్స్ శ్రేణిని ఆవిష్కరించామని కేఎఫ్‌సీ ప్రతినిధులు తెలిపారు. క్లాసిక్ చికెన్ రోల్, పాప్‌కార్న్, క్రషర్లు తదితర వెరైటీలను ఎంచుకునేలా స్నాకర్స్‌ను ప్రారంభించామని పేర్కొన్నారు. సంస్థ అభిమానులను మరింత సంతోషపరచడమే లక్ష్యంగా తమ సేవలను కొనసాగిస్తున్నామని, ఉల్లాసంగా స్నేహితులతో, కుటుంబ సభ్యులతో సమయాన్ని ఆస్వాదించేలా ఈ స్నాకర్స్ శ్రేణిని తీసుకువచ్చామని వారు తెలిపారు.

తపాలా శాఖ బీమా ఏజెంట్ల నియామకం

సాక్షి, సిటీబ్యూరో: భారతీయ తపాలశాఖ, తపాల జీవిత బీమా, గ్రామీణ తపాల జీవిత బీమా పాలసీలు సేకరించేందుకు ఏజెంట్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హైదరాబాద్ నగర తపాల శాఖ సీనియర్ సూపరింటెండెంట్ ఎ.సుబ్రహ్మణ్యం తెలిపారు. పదో తరగతి పాసై, వయస్సు 18 నుంచి-50 ఏళ్ల మధ్య గల హైదరాబాద్ నగరానికి చెందిన నిరుద్యోగ యువతీ యువకులు, రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన వారు పూర్తిచేసిన దరఖాస్తులను అబిడ్స్‌లోని హైదరాబాద్ నగర తపాల శాఖ సీనియర్ సూపరింటెండెంట్ డివిజనల్ కార్యాలయంలో జూన్ 26 లోపు సమర్పించాలన్నారు. ఎంపిక చేసిన అభ్యర్థులు ఈ నెల 27, 28 తేదీల్లో ఉదయం 10 గంటలకు సంబంధిత సర్టిఫికెట్లతో (ఎస్ఎస్‌సీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు) ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు. ఏజెంట్ గా నియమితులైన వారు సెక్యూరిటీ డిపాజిట్ క్రింద రూ.5 వేలు చెల్లించాల్సి ఉంటుందని, మరిన్ని వివరాలకు సమీపంలోని పోస్టాఫీస్ సిబ్బందిని సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

బల్దియా భూములు పరాధీనం

- ఖాజాగూడలో విలువైన ఆరెకరాల భూమి లీజుకు
- ఆసక్తి వ్యక్తీకరణల ఆహ్వానం

సాక్షి, సిటీబ్యూరో: ప్రతినెలా సిబ్బంది జీతాల చెల్లింపులకే తిప్పలు పడుతూ, ఆర్థికంగా తీవ్ర కష్టాల్లో ఉన్న జీహెచ్ఎంసీ .. తనకున్న భూములను పరాధీనం చేసేందుకు సిద్ధమైంది. ఎంతో డిమాండ్ ఉన్న ఖాజాగూడలో దాదాపు ఆరెకరాల భూమిని (26,197 చదరపుమీటర్లు) ఏకంగా 60 సంవత్సరాల పాటు లీజుకిచ్చేందుకు ఆసక్తి వ్యక్తీకరణ పేరిట టెండర్లు ఆహ్వానించింది. ఇందుకుగాను రూ.100 కోట్ల లీజు ప్రీమియం చెల్లింపుతో పాటు దాదాపు రూ.12 కోట్ల వంతున వార్షిక అద్దె చెల్లించాల్సి ఉంటుందని పేర్కొంది. వార్షిక అద్దెను ప్రతి మూడేళ్లకోమారు 12 శాతం పెంచాల్సి ఉంటుందని టెండరు నిబంధనల్లో పేర్కొంది. లీజు ద్వారా సదరు స్థలాన్ని దక్కించుకునే సంస్థ ఐటీ, రియల్‌ఎస్టేట్, పబ్లిక్ రిక్రియేషన్, హాస్పిటాలిటీ, ఇనిస్టిట్యూషనల్ వంటి రంగాలను వాణిజ్యపరంగా అభివృద్ధి చేసి, అద్దెల కిచ్చుకోవడం ద్వారా ఆదాయాన్ని సముపార్జించుకునేందుకు అవకాశం ఉంటుంది. కాగా, భూమిని మాత్రం సబ్‌లీజుకిచ్చుకునే అవకాశం ఉండదు.

ఉన్న స్థలాలు ప్రైవేటుకిచ్చుకుంటారా..?

జీహెచ్ఎంసీ ఈ నిర్ణయంపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే హెచ్ఎండీఏ పరిధిలోని భూముల్ని విక్రయిస్తున్న ప్రభుత్వం.. బల్దియా భూముల్ని సైతం ప్రైవేటుకు కట్టబెట్టేందుకు సిద్ధమవడాన్ని పలువురు వ్యతిరేకిస్తున్నారు. జీహెచ్ఎంసీకి కావాల్సిన వార్డు కార్యాలయాలకే స్థలాలు, భవనాలు లేక కమ్యూనిటీహాళ్లను వార్డు కార్యాలయాలుగా మార్చారు. నగరంలో భూములే కరువైన తరుణంలో ఉన్న భూముల్ని ప్రైవేటుకు ధారాదత్తం చేస్తున్నారని, ఈ విధానమంటూ అలవాటైతే, జీహెచ్ఎంసీ ఎస్టేట్స్‌కు సంబంధించిన ఆస్తుల్ని, పార్కుల్ని సైతం పరాధీనం చేసేందుకు వెనుకాడరనే వ్యాఖ్యానాలు వినపడుతున్నాయి.

ఇన్‌కమ్‌ట్యాక్స్ టవర్స్‌ను పేల్చుతానంటూ..

బెదిరించిన వ్యక్తి అరెస్టు

నాంపల్లి: డయల్-100కు ఫోన్ చేసి ఈ నెల 12న నగరంలోని మూడు ప్రధాన ఆదాయపు పన్ను శాఖ కార్యాలయాలను ఏకకాలంలో బాంబులతో పేల్చేస్తానంటూ బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. బెదిరింపులకు పాల్పడిన వ్యక్తి గుంటూరుకు చెందిన జైని రాధాకృష్ణ (43)గా పోలీసులు గుర్తించారు. ఈ మేరకు సోమవారం మధ్య మండలం డీసీపీ ఎం.వెంకటేశ్వర్లు, అడిషనల్ డీసీపీ ఎ.రమణారెడ్డిలు ఒక సంయుక్త పత్రికా ప్రకటన విడుదల చేశారు. జైని రాధాకృష్ణ వ్యాపారంలో నష్టపోయి ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకున్నాడని, వాటినుంచి బయటపడేందుకు ఇలా తప్పుడు మార్గం ఎంచుకున్నాడని వారు పేర్కొన్నారు. పథకం ప్రకారం జూన్ 11న రాత్రి గుంటూరు నుండి సికింద్రాబాద్‌కు చేరుకున్న రాధాకృష్ణ..అక్కడి నుంచి నగర శివారు ప్రాంతమైన హయత్‌నగర్ సమీపంలోని నిర్మానుష్య ప్రాంతానికి చేరుకుని అక్కడ బాంబు బూచికి పథకాన్ని రచించాడు. అనుకున్నట్టుగా ఈ నెల 12న మూడు రహస్య ప్రదేశాల్లో బాంబును అమర్చినట్లు డయల్-100కు ఫోన్ చేశాడు. పోలీసులు దాన్ని ఫేక్‌గా తేల్చి..అదే రోజు ఫోన్ కాల్ చేసిన వ్యక్తి కోసం గాలించినా సరైన ఆధారాలు లేక అతడు చిక్కలేదు. దీంతో నిందితుడిపై నాంపల్లి పోలీసు స్టేషన్‌తో పాటుగా గాంధీనగర్, సైఫాబాదు పోలీసు స్టేషన్లలో పలు సెక్షన్ల కింద కేసు నమోదు చే శారు. ఈ నెల 18న హయత్‌నగర్‌లోని శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయం వద్ద పట్టుకుని అరెస్టు చేసినట్లు ఎం.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.